నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | ఆదివారం 29 సెప్టెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరద

హాజీపూర్, సెప్టెంబర్ 28 : ఎగువన కురుస్తున్న వర్షాలకు ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, శనివారం 19.6197 టీఎంసీల సామర్థ్యంతో ఉంది. 44,941 క్యూ సెక్కుల వరద వస్తుండగా, హైదరాబాద్ ప్రజల తాగు నీటి అవసరాల కోసం 317 క్యూ సెక్కులు, 16 గేట్లు ఎత్తి దిగువకు 44,624 క్యూ సెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి దిగువకు వెళ్తున్న వరద

వైన్స్‌లలో మద్యం శాంపిళ్ల సేకరణ

మంచిర్యాల ఏసీసీ, సెప్టెంబర్ 28 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పలు వైన్స్‌షాపుల్లో ఎక్సైజ్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. రెగ్యులర్‌గా విక్రయించే బ్రాండ్ మద్యం సీసాల్లో నుంచి శాంపిళ్లు సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించారు. ప్రతి నెలా కొన్ని షాపుల నుంచి ఇలా శాంపిళ్లు తీసి పంపిస్తున్నామని, అందులో భాగంగానే ఈ రోజు శాంపిళ్లు తీసినట్లు ఎక్సైజ్ సీఐ గురవయ్య తెలిపారు. కాగా స్థానికంగా ఉన్న మాధవి వైన్స్‌లో మద్యం కల్తీ జరుగుతుందంటూ సోషల్ మీడియాలో ఓ వార్త చెక్కర్లు కొట్టింది. అధికారులు ఆ వైన్స్‌లోనూ శాంపిళ్లు సేకరించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

మాధవి వైన్స్‌లో శాంపిళ్లు సేకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

బాధితులకు భరోసానివ్వాలి

● రామగుండం సీపీ శ్రీనివాస్ ● ఆర్కేపీ పోలీస్‌స్టేషన్ తనిఖీ

మందమర్రి, సెప్టెంబర్ 28 : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందనే భరోసానివ్వాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. శనివారం రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను ఎస్ఐ రాజశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో తప్పని సరిగా తనిఖీలు చేయాలని, ఫిర్యాదులపై వెంటనే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. మహిళలు, పిల్లలు, సీనియర్ సిటిజన్స్‌తో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, స్పెషన్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీపీపీలో ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

హెల్పర్ కుటుంబానికి న్యాయం చేయాలి

● ఎస్టీపీపీ కార్మికుల డిమాండ్ ● విధులు బహిష్కరించి ఆందోళన

● విధుల్లోకి తీసుకోకపోవడం వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపణ

జైపూర్, సెప్టెంబర్ 28 : ఎస్టీపీపీలో హెల్పర్‌గా పని చేసిన పెగడపల్లికి చెందిన మాసు బాలకృష్ణ ఆత్యహత్మ చేసుకోగా, ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని కాంట్రాక్టు కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎస్టీపీపీలో విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఎస్టీపీపీలో పదేళ్లుగా పని చేస్తున్న బాలకృష్ణ దుమ్మూ ధూళి పడక అనారోగ్యం పాలయ్యాడని, మూడు నెలలుగా విధులకు హాజరుకాలేదని, ఇటీవల ఆరోగ్యం కుదుటపడడంతో విధుల్లోకి తీసుకోవాలని కంపెనీ అధికారుల చుట్టూ తిరిగాడని వారు తెలిపారు. ఉద్యోగం ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని, ఆయన కుటుంబానికి రూ. 30 లక్షల సాయమందించాలని హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ ఉపాధ్యక్షుడు సారయ్య డిమాండ్ చేశారు. పవర్‌మేక్ కంపెనీ హెచ్ఆర్ మధు వేధింపులతోనే కార్మికుడు మృతిచెందాడని ఆరోపించారు. కంపెనీ ప్రతినిధులు బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

వ్యర్థాలకు రూపం తీసుకొచ్చి వినియోగించుకోవాలి

నస్పూర్, సెప్టెంబరు 28 : వ్యర్థాలకు అర్థవంతమైన రూపం తీసుకొచ్చి వినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా సైన్స్ కేంద్రంలో జిల్లా విద్యాశాఖ, నేషనల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో వ్యర్థం నుంచి అర్థం అంశంపై ఆర్ట్, క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. డీఈవో యాదయ్యతో కలిసి అదనపు కలెక్టర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పడేసిన పేపర్లు, ప్లాస్టిక్, కొబ్బరి పెంకులు, గాజు ముక్కలు, పల్లి పొట్టు వంటి వాటిని ఉపయోగించి అలంకరణ వస్తువులు తయారు చేయడం అభినందనీయమన్నారు. డీఈవో యాదయ్య మాట్లాడుతూ 54 పాఠశాలల నుంచి విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి మొదటి బహుమతి కింద రూ. 3 వేలు, రెండో బహుమతి కింద రూ. 2 వేలు, మూడో బహుమతి కింద రూ. 1000, కన్సోలేషన్ బహుమతుల కింద రూ. 200 చొప్పున అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, ఎన్జీసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ విద్యాసాగర్, సెక్టోరియల్ అధికారులు చౌదరి, సత్యనారాయణమూర్తి, ప్రధానోపాధ్యాయులు దత్తకుమార్, సత్యనారాయణ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, అర్చన, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 4 వేల కేసులు పరిష్కారం

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 28 : జిల్లా కేంద్రంలోని కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 4 వేల కేసులు పరిష్కరించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాజీతో ఇరువర్గాల కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల అడిషనల్ సీనియర్ సివిల్ జ్యుడీషియల్ సెక్రటరీ అర్పిత మారంరెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కం జ్యుడీషియల్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ సంపత్, సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ నిరోష, ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఉషనిషధ్వని, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో అడిషనల్ సీనియర్ సివిల్ జ్యుడీషియల్ సెక్రటరీ అర్పిత మారంరెడ్డి

'హస్తం'ను చుట్టుముట్టిన శనిగకుంట..!

మత్తడి పేల్చివేత కేసులో అరెస్టు కానున్న కాంగ్రెస్ లీడర్లు..?



● ఎమ్మెల్యే వివేక్ కార్యక్రమాలను బహిష్కరించిన ఆ వర్గం నాయకులు

● దిగిరాని పక్షంలో మూకుమ్మడి రాజీనామాలు చేస్తామంటూ అల్టిమేటం

● చెన్నూర్‌లో ప్రత్యేక మీటింగ్ నిర్వహించిన షాడో ఎమ్మెల్యే అండ్ టీమ్

● కేసు నుంచి తప్పించుకునేందుకు శాసనసభ్యునిపై అన్ని రకాల ఒత్తిడి

● కాంగ్రెస్‌ను కష్టాల్లోకి నెట్టిన మత్తడి పేల్చివేత ఘటన

మంచిర్యాల, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : చెన్నూర్‌లోని శనిగకుంట మత్తడి పేల్చివేత కేసు 'హస్తం' నేతలను చుట్టుముడుతున్నది. ఈ ఘటనలో కాంగ్రెస్ లీడర్ల అరెస్టు దాదాపు ఖాయమైనట్లే తెలుస్తున్నది. ఎవరు చేసిన పాపానికి వారే శిక్ష అనుభవించక తప్పదన్నట్లు.. మత్తడి పేల్చివేత కేసులో కీలక సూత్రధారులుగా ఉన్న అధికార పార్టీ లీడర్లు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కటకటాల పాలు కానున్నట్లు స్పష్టమవుతున్నది. ఈ కేసులో స్థానిక కౌన్సిలర్ భర్త పెండ్యాల లక్ష్మణ్ సహా మరో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసినప్పటికీ... హస్తం పార్టీ నాయకులే ఈ వ్యవహారంలో కీలకమంటూ 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలను ప్రచురించింది. అసలైన వ్యక్తులను వదిలి.. అమాయకులను పట్టుకున్నారని స్పష్టం చేసింది. అరెస్టు చేసిన వారి విచారణలోనూ ఇదే తేటతెల్లం కావడంతో కాంగ్రెస్ కీలక నాయకులైన గొడిసెల బాపురెడ్డి, పెద్దింటి శ్రీనివాస్, లక్కం రాజబాబును శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేశారు. శనిగకుంట బఫర్‌జోన్‌లో మట్టిపోసిన 10 మందిని అరెస్టు చేయాలనుకున్నప్పటికీ ఈ ముగ్గురే దొరికారు. ఇక్కడే ఈ కేసు కాంగ్రెస్ పార్టీలో చిచ్చు పెట్టింది. కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసిన విషయం తెలుసుకున్న షాడో ఎమ్మెల్యేగా చెప్పుకునే ఓ నాయకుడు వందల మంది అనుచరులతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. పోలీసులతో వాగ్వాదానికి దిగి.. వారిపై ఒత్తిడి తెచ్చి మరీ అరెస్టు చేసిన వారిని బయటికి తీసుకువచ్చాడు. ఈ నేపథ్యంలో పోలీసుల వ్యవహార శైలిపై విమర్శలు వెల్లువెత్తాయి. విచారణ కోసమే తీసుకువచ్చామంటూ పోలీసులు చెప్పినా.. షాడో ఎమ్మెల్యే ఒత్తిడితోనే వదిలేశారనే చర్చ నడిచింది. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ శనివారం ఉదయాన్నే మంచిర్యాలలో ఎమ్మెల్యే వివేక్‌ను కలిసి పరిస్థితిని వివరించినట్లు తెలిసింది. ఈ మేరకు త్వరలోనే కాంగ్రెస్ లీడర్లు సహా ఈ వ్యవహారంలో ప్రయేయమున్న ఇతర పార్టీల నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులను అరెస్టు చేయడం ఖాయమైపోయిందని విశ్వసనీయ సమాచారం.

కేసు నుంచి తప్పించకుంటే రాజీనామాలు..

శనిగకుంట బ్లాస్టింగ్ కేసులో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొడిసెల బాపురెడ్డి, మరో నాయకుడు పెద్దింటి శ్రీనివాస్‌లను పోలీసులు అవమానకరమైన రీతిలో తీసుకెళ్లడంపై.. ఆ వర్గం లీడర్లు ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వారిని కూడబలుక్కున్న షాడో ఎమ్మెల్యే చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలో శనివారం జరిగిన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కార్యక్రమాలను బహిష్కరించారు. ఈ మేరకు సదరు నాయకుడి ఇంట్లో సమావేశమైన లీడర్లు ఎమ్మెల్యే దిగివస్తే సరేనని.. లేకపోతే మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని చర్చించుకున్నట్లు తెలిసింది. శనిగకుంట కేసు నుంచి బయటపడేయాలని.. లేకపోతే రాజీనామాలు తప్పవని సదరు లీడర్లు ఎమ్మెల్యే వివేక్‌పై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఆ షాడో లీడరైతే చెన్నూర్, కోటపల్లి మండలంలోని తన అనుచరులకు ఫోన్లు చేసి మరీ ఎవరూ ఎమ్మెల్యే ప్రోగ్రామ్‌కు రావద్దంటూ హుకుం జారీ చేశారనే ప్రచారం జరుగుతున్నది. అందుకే ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో నిర్వహించిన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, గృహలక్ష్మి ధ్రువీకరణ పత్రాల పంపిణీకి కీలక లీడర్లు ఎవరూ హాజరుకాలేదు. ఇది అక్కడ కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. కాగా, ఎమ్మెల్యే సాయంత్రం క్యాంప్ ఆఫీసు నుంచి బయటికి వచ్చి అధికారుల రివ్యూ మీటింగ్‌కు వెళ్తుండగా కొందరు కాంగ్రెస్ నాయకులు షాడో ఎమ్మెల్యే సహా శనిగకుంట కేసులో కీలక సూత్రధారులుగా ఉన్న లీడర్ల వద్దకు మీరు వెళ్లవద్దంటూ వేడుకున్నారు. మీరు అక్కడికిపోతే పరువు పోతుందని.. పార్టీ కోసం కష్టపడే నాయకులు ఉరేసుకోవాల్సి వస్తుందంటూ ఎమ్మెల్యేకు స్పష్టం చేశారు. దీంతో ఆయన మండల రివ్యూ మీటింగ్ చూసుకొని, నేరుగా వెళ్లిపోతానని.. తాను ఎవరి వద్దకు వెళ్లనని చెప్పినట్లు తెలిసింది.

ఎమ్మెల్యే వర్సెస్ షాడో ఎమ్మెల్యే

శనిగకుంట కేసులో ఎవరున్నా వదిలేది లేదని ఎమ్మెల్యే వివేక్ గతంలోనే చెప్పారు. ఇది ఆ కేసుతో ప్రమేయం ఉన్న కీలక కాంగ్రెస్ లీడర్లకు నచ్చడం లేదని ఈ రోజు పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఎమ్మెల్యే వివేక్‌ను కాదని షాడో ఎమ్మెల్యే మిగిలిన వారందరినీ కలుపుకొని చెన్నూర్‌లో ఎమ్మెల్యే వివేక్ మీటింగ్ జరుగుతుండగానే, మరో మీటింగ్ ఏర్పాటు చేశారు. దీంతో ఈ కేసులో ఆ పార్టీ నాయకులను అరెస్టు చేస్తే అంతా కలిసి రాజీనామాలు చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అదే జరిగితే చెన్నూర్‌లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి కుక్కలు చింపిన విస్తరి కావడం ఖాయంగా కనిపిస్తున్నది. ఈ దెబ్బతో ఎవరికి వారు షాడో ఎమ్మెల్యేలుగా చెప్పుకునే వారంతా అధికార పార్టీకి దూరం అవుతారని, వారిని కాదని ఎమ్మెల్యే వివేక్ నియోజకవర్గంలో ఏం చేయలేరనే చర్చ నడుస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో ఎమ్మెల్యే వివేక్ వారికి లొంగిపోతారనే భయం క్షేత్రస్థాయి కాంగ్రెస్ శ్రేణుల్లో కనిపిస్తుంది. అలాంటి వారిని వెనకేసుకొస్తే పార్టీ కోసం కష్టపడే వారు నొచ్చుకునే అవకాశాలు ఉన్నాయి. ఎమ్మెల్యేను కాదని ఆయనకు వ్యతిరేకంగా కొట్లాడుతున్న వాళ్లు పార్టీకి రాజీనామా చేయడానికి ముందే పార్టీ నుంచి వారిని సస్పెండ్ చేయాలనే డిమాండ్ సైతం వినిపిస్తున్నది. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో ఏం జరుగుతుంది.. ఎమ్మెల్యే ఏం నిర్ణయం తీసుకుంటారు.. అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మొత్తానికి శనిగకుంటు కేసు కాంగ్రెస్ పార్టీని చుట్టుముట్టిందన్న చర్చ జోరుగా నడుస్తున్నది.

బాంబులతో పేల్చివేసిన శనిగకుంట చెరువు మత్తడి (ఫైల్)

భీం వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి

● ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు ● జోడేఘాట్‌లో కలెక్టర్, పీవో, అదనపు కలెక్టర్, ఎస్పీతో కలిసి సమీక్ష

కెరమెరి, సెప్టెంబర్ 28 : పోరాట వీరుడు కుమ్రం భీం 84వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు అన్నారు. శనివారం జోడేఘాట్‌లోని మ్యూజియంలో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, పీవో ఖుష్బూ గుప్తా, ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, భీం వర్ధంతి కమిటీ గౌరవ అధ్యక్షుడు కుమ్రం సోనేరావ్, ఉత్సవ కమిటీ చైర్మన్ పెందోర్ రాజేశ్వర్, ఆయా శాఖల అధికారులు, ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అప్పటి సీఎం కేసీఆర్ పోరుగడ్డ ప్రగతికి ఎంతో కృషి చేశారని, రూ.25 కోట్లతో రెండు వరుసల రోడ్డు, భీం నిలువెత్తు కాంస్య విగ్రహం, స్మృతివనం, స్మారక మ్యూజియం, జోడేఘాట్ వాసులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. అటవీ అధికారుల అడ్డగింతతో టోకెన్ మోవాడ్ నుంచి హట్టి వరకు 4 కిలో మీటర్ల రహదారి నిర్మాణం నిలిచిపోయిందని, దానిని సైతం పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. వర్ధంతికి అన్ని ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. వర్ధంతి సభకు సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు వచ్చే అవకాశముందని, దీర్ఘకాలిక సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లేలా ఆదివాసులు ప్రత్యేక నివేదిక తయారు చేయాలని కోరారు. కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే మాట్లాడుతూ భీం వర్ధంతి, దర్బార్‌కు వీఐపీలు వచ్చే అవకాశమున్నందున హెలీప్యాడ్ నుంచి సభా స్థలం వరకు బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ.. కార్యక్రమానికి వచ్చే వారందరికీ భోజనంతో పాటు తాగునీటి వసతి కల్పించాలని, మహిళలు, పురుషులకు వేర్వేరుగా తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పాటగూడలో అంగన్‌వాడీ కేంద్రం, బాబేఝరి పాఠశాలలో సిబ్బంది కొరత నివారణకు చర్యలు చేపడతామని చెప్పారు. వర్ధంతి రోజున హట్టి నుంచి జోడేఘాట్ వరకు ఉచిత ఆర్టీసీ బస్సులు నడిపించనున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ దర్బార్ జరిగే స్థలంలో అన్ని శాఖల అధికారులతో స్టాళ్లు ఏర్పాటు చేయాలని, ప్రజల నుంచి వచ్చే అర్జీలను స్వీకరించి వాటి పరిష్కరానికి కృషి చేయాలన్నారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. హెలీప్యాడ్, సభా వేదికతో పాటు ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బలగాలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. శాంతి భద్రతలకు భంగం కలగకుండా ఆదివాసీలు సహకరించాలని కోరారు. జోడేఘాట్‌తో పాటు పరిసర గ్రామాలను అభివృద్ధి చేయాలని ఉత్సవ కమిటీ చైర్మన్, పెందోర్ రాజేశ్వర్, మోతీరాం సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, సుధాకర్, ప్రభాకర్ రావు, రఘూనాథ్, జగన్నాథ్ రావు, ద్రుపతాబాయి, తహసీల్దార్ దత్తు ప్రసాద రావు, ఎంపీడీవో మహ్మద్ అమ్జద్‌పాషాతో పాటు అన్ని శాఖల జిల్లా, డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

భీం సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు, కలెక్టర్, పీవో, ఎస్పీ, అదనపు కలెక్టర్

కాల్మొక్తం.. కనికరించండి

● చెన్నూర్ ఎమ్మెల్యే వెంకటస్వామి కాళ్లు మొక్కిన దళిత మహిళలు ● కాళ్ల మీద పడాలని ప్రోత్సహించిన అగ్రవర్ణ నాయకుడు

● సీఎం రేవంత్‌రెడ్డి అన్నకే నోటీసులిచ్చారని ఛీదరించుకున్న వివేక్ ● భీమారం కాంగ్రెస్‌లో గందరగోళ పరిస్థితి

భీమారం, సెప్టెంబర్ 28 : '70 ఏండ్లుగా ఇక్కడే ఉంటున్నం. ఇప్పుడచ్చి చెరువులో మా ఇండ్లున్నయంటున్నరు. గవ్విటిని కూల్చుతమని నోటీసులిచ్చిన్రు. కాల్మొక్తం. కనికరించి.. మాకు న్యాయం చేయుండ్రి' అంటూ మంచిర్యాల జిల్లా భీమారం మండలం సుంకరిపల్లి గ్రామస్తులు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ కాళ్లపై పడ్డారు. శనివారం భీమారంలోని రైతు వేదిక వద్ద వివేక్ అధికారులతో కలిసి సబ్సిడీ గ్యాస్ సిలిండర్ల ప్రొసీడింగ్‌లతో పాటు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. భీమారానికి చెందిన 40 మంది చిరువ్యాపారులు కూడా అక్కడికి చేరుకొని తమ గోడు వెల్లబోసుకున్నారు. చెరువు శిఖంలో కట్టడాలున్నాయని తమకు నోటీసులిచ్చారని.. న్యాయం చేయాలని ఎమ్మెల్యేను వేడుకున్నారు. ఇంతలోనే అక్కడున్న కాంగ్రెస్ నాయకులు కలగజేసుకొని పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో.. ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. ఇలా తప్పుదోవ పట్టిస్తే కలెక్టర్‌కు నేనేమీ చెప్పాలన్నారు. ఇంతలోనే బాధితులు మాట్లాడేందుకు యత్నించగా, ఎమ్మెల్యే స్పందిస్తూ స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి వాళ్ల అన్నకే నోటీసులు ఇచ్చారని ఛీదరించుకున్నారు. ఈ క్రమంలో ఓ అగ్రవర్ణ కాంగ్రెస్ నాయకుడు సుంకరపల్లి దళిత మహిళలను వివేక్ కాళ్లు మొక్కాలని ప్రోత్సహించాడు. బాధితులకు న్యాయం చేయాలని పోడెటి రవితో పాటు మాజీ జడ్పీటీసీ జర్పుల రాజ్‌కుమార్ నాయక్ వర్గం ప్రయత్నం చేస్తుండగా, కాంగ్రెస్ జిల్లా నాయకుడు చేకూర్తి సత్యనారాయణ రెడ్డి వర్గం మాత్రం చెరువును కబ్జాల నుంచి కాపాడాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కల్పన, ఎంపీడీవో మధుసూదన్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ మూర్తి, కాంగ్రెస్ నాయకులు కోట రవి, బానోత్ విజయ్ నాయక్, కొక్కుల నరేశ్, శ్యాం సుందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కాళ్లు మొక్కుతున్న బాధిత మహిళ

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్‌రాజ్

గుండె వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్‌రాజ్

● నస్పూర్ పీహెచ్‌సీలో ప్రపంచ గుండె వ్యాధుల నివారణ దినోత్సవం

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 28 : గుండె వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ పేర్కొన్నారు. శనివారం నస్పూర్ మున్సిపాలిటీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ గుండె సంబంధిత వ్యాధుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఆశ కార్యకర్తలకు బీపీ, మధుమేహం పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుండె సంబంధిత వ్యాధులపై వైద్యులు అవగాహన కల్పించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మారుతున్న ఆహారపు అలవాట్లతోనే వ్యాధులు పెరుగుతున్నాయన్నారు.ప్రతి రోజూ వ్యాయామం చేయాలని, నాణ్యమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. అనంతరం పొగాకు వాడడం వల్ల కలిగే అనర్థాలు, వ్యాధులపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, కమిషనర్ చిట్యాల సతీశ్, వైద్యులు అనిత, సమత, శివప్రతాప్, రుబీనా, సూపర్‌వైజర్లు, లక్ష్మణస్వామి, వెంకట్, ఆరోగ్య కార్యకర్త వెంకటసాయి, డీపీహెచ్ఎన్ పద్మ, సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.